క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ బాలాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ కేశవరెడ్డినగర్ ఫీడర్ పరిధిలోని టీఎస్ఆర్‌నగర్, ప్రశాంతిహిల్స్ రోడ్ నం–1, 2, రాఘవేంద్రనగర్, మీర్‌పేట పోస్టాఫీసు, మీర్‌పేట పోలీస్ స్టేషన్, సీతాహోమ్స్‌లో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు. 11కేవీ ప్రశాంతిహిల్స్ ఫీడర్ పరిధిలోని సిర్లాహిల్స్, న్యూ బాలాజీనగర్, ప్రశాంతిహిల్స్, శివసాయినగర్‌లలో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు.

విద్యార్థినికి ప్రోత్సాహక నగదు అందజేత



విద్యార్థినికి నగదు అందిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

కందుకూరు: మండల పరిధిలోని ఆకులమైలారం జిల్లా పరిషత్ పాఠశాలలో గతేడాది పది ఫలితాల్లో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థిని రోజాకు గోరుతి ఈశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.15వేలు ప్రోత్సాహక నగదు అందజేశారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఇదే విధంగా ప్రతి ఏడాది ప్రోత్సాహకాలను అందజేస్తామని ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకుడు బూచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు తిరుపతిరెడ్డి, జైచంద్రారెడ్డి, దోసాడ రామకృష్ణారెడ్డి, హెచ్ఎం వనజాకుమారి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రిటీషర్లతో పోరాడిన విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్

హస్తినాపురం: భారత స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఆ సంఘం రాష్ట్ర మాజీ నాయకులు మెగావత్ సీతారాం నాయక్ అన్నారు. మంగళవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హస్తినాపురం డివిజన్‌లో సిగ్నల్ వద్ద ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు. బాదరాజు భవాని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీతారాంనాయక్ హాజరై మాట్లాడారు. బెనారస్ విశ్వవిద్యాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, ఆజాద్ వంటి ఎందరో వీరుల ఆశయ సాధనకు బాబ్రుద్దీన్, ప్రేమ్‌నారాయణ్‌భార్గవ్‌ల నాయకత్వంలో 1936 ఆగస్టు 12న ఏఐఎస్ఎఫ్ ఆవిర్భవించిందని అన్నారు. ఏఐఎస్ఎఫ్ సంఘం నాయకులు సంతోష్, రేణుక, ఉష, సాయి పాల్గొన్నారు.

ప్రారంభం కాకుండానే బంద్.!

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి బీడీరెడ్డి గార్డెన్ సమీపంలోని తెలంగాణ చౌరస్తాలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పబ్లిక్ టాయిలెట్లు ప్రారంభం కాకుండానే మూతబడిపోయాయి. తెలంగాణ చౌరస్తాలో రెండేళ్ల క్రితం కంటైనర్‌తో కూడిన టాయిలెట్లను ఏర్పాటు చేశారు. అయితే సరైన నీటి సౌకర్యం లేకనో.. నిర్వహణ లేకనో అవి ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. కాగా టాయిలెట్లు చౌరస్తా సమీపంలో ఉండటంతో అక్కడ రోడ్డు ఇరుకుగా మారి తరచుగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్న నిరుపయోగ టాయిలెట్లను అక్కడి నుంచి తీసివేయాలని స్థానికులు కోరుతున్నారు.

తెలంగాణకు కేంద్రం మొండిచేయి


మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఎల్‌బీనగర్: రాష్ట్రం పట్ల కేంద్రం చిన్న చూపు చూస్తోందని.. తెలంగాణకు నిధులు మంజూరు చేయకుండా మొండిచేయి చూపిస్తోందని రంగారెడ్డి జిల్లా సీపీఎం కార్యదర్శి పగడాల యాదయ్య ఆరోపించారు. సీపీఎం హయత్‌నగర్ సర్కిల్ కార్యవర్గం సమావేశం మంగళవారం నాయకుల కొత్త గణేష్‌గౌడ్ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యాదయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న తెలంగాణకు నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని అన్నారు. బీసీ బిల్లు ఆమోదించకుండా కేంద్ర ప్రభుత్వం తొక్కిపెడుతుందని విమర్శించారు. బీజేపీ మాటలలో చేతల్లో విషము చిమ్ముతున్నారని దీనిని ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కేంద్రం ప్రభుత్వం వెంటనే 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును రాష్ట్రపతి ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం హయత్‌నగర్ సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి, నాయకులు చంద్రమోహన్, కృష్ణయ్య, కనకయ్య, మల్లేశం, భాస్కర్, కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

జంక్షన్.. టెన్షన్

పెరిగిన వాహనాల రద్దీ

- నిత్యం ట్రాఫిక్ జాం..
- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- మరో సర్కిల్ ఏర్పాటుకు ఆవశ్యకత


ముత్యాలమ్మ జంక్షన్

పహాడీషరీఫ్: జనాభా పెరుగుదలతో పాటు.. వాహనాల సంఖ్య నానాటికీ రెట్టింపవుతోంది. రోజుకు లక్షల్లో కొత్త వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. కానీ ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా రహదారులు విస్తరణకు నోచుకోకపోవడంతో ట్రాఫిక్ జాంతో పాటు, రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో కొత్తగా జంక్షన్ల ఏర్పాటుతో పాటు.. రహదారుల విస్తరణ అనివార్యమైంది. జల్‌పల్లి మున్సిపాలిటీ ముత్యాలమ్మ ఆలయం వెనుక భాగం పి– 7 కార్గో రోడ్డు జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. సుమారు 18 ఏళ్ల క్రితం నిర్మించిన కూడలి కావడంతో.. ప్రస్తుత వాహనాల రద్దీకి ఇరుకుగా మారింది. దీంతో శ్రీరామకాలనీ రోడ్డుకు ఎదురుగా ఆలయం వెనకాల సర్కిల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఇదే విషయమై.. స్థానికులు కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

దూర భారమని..

శ్రీరామకాలనీ నుంచి జల్‌పల్లి, మామిడిపల్లి, పహాడీషరీఫ్ వైపు వెళ్లాల్సిన వాహనదారులు.. అర కిలో మీటర్ దూరంలోని వాంబే కాలనీ వద్ద యూటర్న్ తీసుకోవాలి. కానీ.. దూర భారం తగ్గుతుందన్న ఆలోచనతో 150 మీటర్ల దూరం రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఒకే మార్గంలో ఇరువైపులా వాహనాల రాకపోకలతో ప్రమాదాలు జరగడంతో పాటు.. ట్రాఫిక్ జాం అవుతోంది.

కూడలి ఏర్పాటుతో ఉపశమనం

ఆలయం వెనకాల సర్కిల్ ఏర్పాటు చేస్తే.. రెండు రూట్లలో రాకపోకలు సాగించే వాహనదారులకు ఉపశమనం కలగనుంది. జల్‌పల్లి వైపు నుంచి సబితా ఇంద్రారెడ్డి కాలనీకి వచ్చే వాహనదారులు.. నూతనంగా ఏర్పాటు చేసే సర్కిల్ వద్ద యూటర్న్ తీసుకొని ఆలయం ముందు నుంచి వెళ్లేందుకు వీలుంటుంది. శ్రీరామ కాలనీ నుంచి జల్‌పల్లికి వెళ్లే వారు సైతం ఇదే సర్కిల్ వద్ద యూటర్న్ తీసుకొని సమీపంలోని జంక్షన్ నుంచి జల్‌పల్లికి వెళ్లవచ్చు. నూతన సర్కిల్ ఏర్పాటుతో దూరభారంతో పాటు ప్రమాదాలను నియంత్రించే అవకాశం ఉంది.

ఇష్టానుసారంగా పార్కింగ్



దుర్గానగర్ చౌరస్తా నుంచి మామిడిపల్లి వరకు 100 ఫీట్ల విస్తీర్ణంతో కూడిన ఈ పి– 7 రహదారిలో వ్యాపార సముదాయాల ఎదుట వాహనదారులు తమ వాహనాలను ఇష్టానుసారంగా నిలిపివేస్తున్నారు. ఇది మిగతా వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. ముత్యాలమ్మ జంక్షన్‌కు వెళ్లే మార్గంలోని 150 మీటర్ల దూరంలో రోడ్డుకు ఒకవైపు ఉన్న దుకాణాల ఎదుట రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. మరాఠ భవన్ రోడ్డులో అదే దుస్థితి. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి, సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

తీరనున్న రహదారి సమస్య


మాన్యగూడ మార్గంలో పూర్తయిన కల్వర్టు, మట్టితో చదును చేసిన రహదారి

- నేదునూరు గేట్ నుంచి మాన్యగూడ వరకు బీటీరోడ్డు పనులు ముమ్మరం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు, వివిధ గ్రామాల ప్రజలు

కందుకూరు: ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతులు, వివిధ గ్రామాల ప్రజలకు రహదారి సమస్య తీరనుంది. మండలంలోని నేదునూరు గేట్ నుంచి నేరుగా మాన్యగూడకు చేరుకునే రహదారి పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. గతేడాది నవంబర్ 30న మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా రూ.8కోట్ల సీఆర్ఆర్ నిధులతో నేదునూరు మూల మలుపు నుంచి మాన్యగూడ గ్రామం మీదుగా మద్దెలకుంట తండావరకు దాదాపుగా 7 కిలోమీటర్ల రహదారిని బీటీగా మార్చడానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఆ రహదారిపై కల్వర్టుల నిర్మాణం వేగంగా సాగుతోంది. మట్టి పోసే పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. త్వరలో మిగతా నిర్మాణ పనులు కొనసాగనున్నాయి. కాగా ఆ రహదారి నిర్మాణం పూర్తయితే మాన్యగూడ ప్రజలతో పాటు దాసర్లపల్లి, రావిచేడు ఆ పై గ్రామాలకు కందుకూరు చేరుకోవడానికి దగ్గరి దారవుతుంది. మరోపక్క నేదునూరు, మాన్యగూడ రైతుల పొలాలన్నీ అధికంగా ఆ రహదారి వైపే ఉన్నాయి. దీంతో రైతులు, ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పొలాల్లో హైటెన్షన్ టవర్లు, లైన్లు వద్దు

ఆర్డీఓ కార్యాలయం ఎదుట కడ్తాల్ మండల రైతుల నిరసన


నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

కందుకూరు: పచ్చని పంటలు పండే మా భూముల్లో హైటెన్షన్ టవర్లు, లైన్లు ఏర్పాటు చేయొద్దని రైతులు తేల్చిచెప్పారు. కడ్తాల్ మండల పరిధిలోని గ్రామాల పొలాల మీదుగా కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి మీర్‌ఖాన్‌పేట పరిధిలోని 765 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు టవర్లు, లైన్ల ఏర్పాటు చేపట్టారు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం కందుకూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం పవర్‌గ్రిడ్ అధికారుల సమక్షంలోనే ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి సమస్యను వివరించి వినతిపత్రం అందించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వారికి ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రాథమిక నిబంధనలు పాటించకుండా.. రైతుల అనుమతి తీసుకోకుండా పొలాల్లో ఇష్టానుసారంగా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసి హైటెన్షన్ టవర్లు, లైన్లు ఏర్పాటు చేస్తున్నారని మండిపడ్డారు. లైన్ల ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు రాకముందే జిల్లా, మండల స్థాయి అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తూ పొలాల్లో పనులు చేపట్టారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్ పాటించకుండా పనులు చేపడతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టవర్లు, లైన్ల ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణ, యువజన సంఘాల అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేశ్, రైతులు జెల్ల శివరామకృష్ణ, పర్వత్‌కుమార్‌యాదవ్, పెంటారెడ్డి, అభిషేక్‌రెడ్డి, జి.రాజేందర్‌యాదవ్, జి.కృష్ణ, మహేష్, శ్రీరాములుగౌడ్, కేశవులుగౌడ్, కృష్ణ.కుమార్, కె.సత్యానారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేచేసి.. సమస్యలకు పరిష్కారం చూపి

- భూ పరిశీలనకు కదిలిన రెవెన్యూ యంత్రాంగం
- వివాదాస్పద భూములపై దృష్టి

ఇబ్రహీంపట్నం: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం కదిలింది. మండలానికి ట్రైనీ లైసెన్సుడ్ సర్వేయర్లను 20 మందిని కేటాయించారు. 45 రోజుల పాటు వీరు పనిచేయనున్నారు. వివాదాస్పద భూముల సర్వే చేసి, రైతులకు న్యాయం చేయనున్నారు. పలు సర్వే నంబర్లలోని రికార్డుల్లో తక్కువ భూమి, సర్టిఫికెట్లు, పాసు బుక్కుల్లో ఎక్కువ భూమి చూపుతుండటంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్న నేపథ్యంలో.. సర్వే చేసి, నాటి అసైండ్ భూ పత్రాలు, పాసు బుక్కులను పరిశీలించి సమస్య తీర్చనున్నారు. ఉప్పరిగూడ, సీవీఆర్, భారత్ కళాశాల సమీపంలోని(వెనుక) ఉన్న 1146 సర్వే నంబర్‌లో ప్రభుత్వం అసైండ్ చేసిన భూమిలో రికార్డు కంటే అదనంగా 27 ఎకరాల 3 గుంటలు వస్తోంది. దీంతో సర్వేయర్లు ఈ భూమిని మంగళవారం సర్వే చేయగా 138 ఎకరాల 4 గుంటలు తేలింది. సుమారు 80 మంది రైతులు ఈ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోగా.. ఆ దిశగా రెవెన్యూ యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. దీంతో రైతుల ఇబ్బందులు తొలగనున్నాయి. ఈ సర్వేలో తహసీల్దార్ సునితారెడ్డి, డీటీ శ్రీనివాస్‌గౌడ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సువర్ణ, సర్వేయర్ సాయికృష్ణారెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు వీరన్న, విష్ణు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కిట్స్ పంపిణీ

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం చెన్నకేశవకాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం నగరానికి చెందిన అసెన్సిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సహకారంతో మానవతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా స్కూల్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానవతా ఫౌండర్ డా.రమ్య.. చిన్నారులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసన్సిస్ సంస్థ డైరెక్టర్ అర్పిత్, వైది, గగన్, మానవతా సభ్యులు సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 37, వంకాయ 23, బెండ 45, పచ్చి మిర్చి 45, కాకర 23, బీర 28, క్యాబేజి 13, ఫ్రెంచిబీన్స్ 50, క్యారెట్ 45, దొండ 23, చిక్కుడు 55, గోకర 28, బీట్‌రూట్ 28, క్యాప్సికం 40, ఆలుగడ్డ 23, దోస 15, సొరకాయ 11, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 23లుగా ఉన్నాయి. గమనిక: ఈ ధరలు బుధవారం ఉదయం 9గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సామూహిక కుంకుమార్చన

మన్సూరాబాద్: శ్రావణమాసంను పురస్కరించుకుని మన్సూరాబాద్ పోచమ్మ దేవాలయంలో మంగళవారం మహిళలచే సామూహిక కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాల వేలం ప్రక్రియను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, పోచబోయిన గణేష్‌యాదవ్, నాంపల్లి శంకరయ్య,కృష్ణ, బొల్లు యాదయ్యయాదవ్, రాజేందర్‌గౌడ్, అమర్‌గౌడ్, ఈశ్వర్, స్వామి, సురేష్, అర్చకులు శ్రీధరచార్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్‌నగర్‌కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

మన్సూరాబాద్: డివిజన్ హయత్‌నగర్ పరిధి శ్రీరామ్‌నగర్‌కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొలుసు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నాగార్జునరెడ్డి, కోశాధికారిగా మహేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, తన్నీరు శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను ముందుండి పరిష్కరిస్తానని, కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎంపీడీఓ వెంకయ్య


మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: భారీ వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రెండు రోజుల్లో పెద్దఎత్తున వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని, అధికారులు గ్రామాల్లో పర్యటించి శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, భవనాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. మరమ్మతులు చేయాల్సిన పాఠశాలల నుంచి విద్యార్థులను ఖాళీ చేయించాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ గిరి రాజు, పంచాయతీ రాజ్ ఏఈ నందకిశోర్, ఏపీఓ నాగభూషణం, కార్యదర్శులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు


గుంతలమయంగా మారిన శ్రీరాంకాలనీ-వాంబేకాలనీ రోడ్డు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరామ కాలనీ నుంచి వాంబే కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో మడుగులను తలపిస్తున్నాయి. ఇటు మహేశ్వరం, అటు రాజేంద్రనగర్ నియోజకవర్గాల సరిహద్దులో ఉండడంతో మొదటి నుంచి ఈ రహదారిపై నిర్లక్ష్యం కొనసాగుతూనే వస్తోంది. శ్రీరాం కాలనీలోని పారిశ్రామిక వాడకు లోడ్‌తో వెళ్లే భారీ లారీలతో ఈ రోడ్డు మరింత గోతులుగా మారుతోంది. ముఖ్యంగా శ్రీరామ కాలనీ నుంచి మోడీ బిల్డర్స్ అపార్ట్‌మెంట్స్ వరకు రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆయా కాలనీల ప్రజలు, స్థానికులు కోరుతున్నారు.

వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీబిజీ


పులిమామిడిలో వరినాట్లు వేయడానికి నారు తీస్తున్న కూలీలు


పీఏసీఎస్ కార్యాలయం గోదాం నుంచి యూరియాను ఆటోల్లో తరలిస్తున్న రైతులు

కందుకూరు: ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. వరినాట్లు వేసుకోవడం, పొలాలను దమ్ము చేయడం, మొక్కజొన్న, పత్తి, జొన్న తదితర పంటలకు ఎరువులు వేసుకోవడం వంటి పనులు చేసుకుంటున్నారు. మరోపక్క పంటల కోసం ఎరువులను కొనుగోలు చేసి పంట పొలాలకు తరలించే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. దీంతో ఏ గ్రామ పరిధిలోని పొలాల్లో చూసినా కూలీలు, రైతులతో సందడిగా మారింది.

మహాసభలను విజయవంతం చేయాలి

మొయినాబాద్: భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం మొయినాబాద్ మున్సిపాలిటీలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆయన పలువురు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శత వసంతాలు పూర్తిచేసుకున్న సీపీఐ పార్టీ పీడిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలు, కార్మికులు, కర్షకుల కోసం అనేక పోరాటాలు చేసి వారి హక్కులను సాధించిందన్నారు. దున్నేవాడిదే భూమి అనే నినాదంతో లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీదేనన్నారు. ఈ నెల 19 నుంచి 22 వరకు పార్టీ రాష్ట్ర మహాసభలు మేడ్చెల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లోని గాజుల రామారంలో జరుగుతాయని.. ఈ మహాసభలకు అన్ని ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు పెత్త ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభులింగం, సత్యనారాయణ, నాయకులు సుధాకర్‌గౌడ్, మంజుల, జలీల్, వెంకటయ్య, బాలమణి, రాములు, నర్సింలు, పాండు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి కృషి చేద్దాం

పంచాయతీ కార్యదర్శి శ్రీలతరెడ్డి


పంచాయతీ కార్యదర్శి శ్రీలతరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: గ్రామ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని పంచాయతీ కార్యదర్శి శ్రీలతరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా శ్రీలతరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. చిన్నమంగళారంలో పనిచేసిన కార్యదర్శి గత నెలరోజుల క్రితం కాశింబౌలి గ్రామ పంచాయతీకి బదిలీ అయ్యారు. దీంతో శ్రీలతరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అందరూ సహకరించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. ఇందుకు గాను రోడ్లపై చెత్త వేయకుండా చెత్త బండిలో వేయాలని సూచించారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు తమవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వాసుదేవ్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు గన్నెపాగ నర్సింగ్‌రావు, పార్టీ ప్రధాన కార్యదర్శి నయీముద్దీన్, నాయకులు రత్నం, జాఫర్, ఆనందం, మహిళలు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- ఏడాదిలోనే రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు
- సాగర్ రహదారి విస్తరణకు కృషి
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి


డీసీసీబీ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

యాచారం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిధి యాచారం, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్ గ్రామాల్లో మంగళవారం రూ.9 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మరో రూ.50 లక్షలతో యాచారం సీహెచ్‌సీలో మరమ్మతుల పనులు ప్రారంభించారు. ప్రజలకు 24 గంటల పాటు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. మరో కార్యక్రమంలో పలువురు అర్హులకు రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఒక్క ఏడాదిలోనే నియోజకవర్గంలో రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో 10 వేల ఎకరాలకు పైగా భూములను ఫార్మాకు ఇచ్చామని, దాంతోనే మండలంలోని 24 గ్రామాల్లో సీసీరోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.50 కోట్లకు పైగా టీజీఐఐసీ నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించామని వివరించారు. సాగర్ రోడ్డును హైవేగా నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్ ఫార్మా భూ బాధితులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

ఆర్థిక ప్రగతి సాధించండి

వ్యాపార కేంద్రమైన మాల్‌లో నూతన డీసీసీబీ బ్రాంచ్‌ను డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ బ్రాంచ్‌లో అన్ని రకాల ఆర్థిక సేవలు పొందవచ్చని తెలిపారు. చైర్మన్ సత్తయ్య మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో ఆదిబట్లలో డీసీసీబీ భవనాన్ని సకల సౌకర్యాలతో నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. కొత్తగా పీఏసీఎస్‌ను ఏర్పాటు చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకుని, ఆర్థిక ప్రగతి సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి మాధవరావు, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీడీఓ రాధారాణి, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, సీఈఓ నాగరాజు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీలు రామకృష్ణ, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహ, నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, అమృతాసాగర్, కవిత పాల్గొన్నారు.